నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
8 | నిజామాబాద్ గురువారం 3 ఏప్రిల్ 2025 | ADILABAD NIRMAL

ఫ్యాక్టరీని ఇక్కడే ఏర్పాటు చేయాలి..

నిర్మల్ జిల్లాలో వెంటనే పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే మా లాంటి ఆయిల్‌పామ్ రైతులకు భరోసా ఉంటుంది. తోటలను సాగు చేసేందుకు రైతులు కూడా ఇంకా పెద్ద సంఖ్యలో ముందుకొస్తారు. 2021 సంవత్సరంలో పదెకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన. ప్రస్తుతం చెట్లు పెద్దగైనయ్. పోయిన సంవత్సరమే కొన్ని చెట్లకు గెలలు వచ్చినయ్. మొదటి సారి వచ్చిన గెలలు తీసేయాలని అధికారులు చెప్పారు. ఈసారి వచ్చిన గెలలు పెద్దగా పెరిగినయ్. ఎకరానికి రెండు నుంచి మూడు టన్నుల దిగుబడి వస్తుందని అనుకుంటున్నా. ప్రస్తుతం టన్నుకు రూ.20 వేల వరకు ధర ఉంది. వచ్చే జూన్ నెలలో గెలలు పూర్తిగా కోతకొస్తాయి. గతంలో 15 ఏళ్లపాటు బతుకు దెరువు కోసం దుబాయిలో పని చేసిన. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నదని, పంటలకు ప్రోత్సాహమిస్తున్నదని తెలిసి ఐదేండ్ల కింద ఇండియాకు తిరిగి వచ్చిన. ఉన్న ఊరిలో వ్యవసాయం చేసుకుంటూ ఆనందంగా కుటుంబంతో కలిసి ఉంటున్న.

- గజ్జెల మల్లు, ఆయిల్‌పామ్ రైతు, ముజ్గి, నిర్మల్ మండలం.

దిలావర్‌పూర్ మండలంలో కోతకొచ్చిన ఆయిల్‌పామ్ గెలలు

పాక్‌పట్ల వద్ద పామాయిల్ పరిశ్రమ కోసం కొనుగోలు చేసిన స్థలం

2023లో ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం అప్పటి బీఆర్ఎస్ మంత్రులు కేటీఆర్, నిరంజన్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

పామాయిల్ పరిశ్రమకు రాజకీయ గ్రహణం

- రెండు, మూడు నెలల్లో రానున్న దిగుబడులు
- కొనుగోళ్లపై నెలకొన్న సందిగ్ధత
- నేటికీ మొదలు కాని ఫ్యాక్టరీ పనులు
- రైతుల గోడు పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- అయోమయంలో ఆయిల్‌పామ్ రైతులు

నిర్మల్, ఏప్రిల్ 2(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలో పామాయిల్ పరిశ్రమ ఏర్పాటుకు రాజకీయ గ్రహణం పట్టుకున్నది. కేసీఆర్ ప్రభుత్వం రైతులను లాభాల బాట పట్టించేందుకు ఆయిల్ పామ్ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా మొదటి దశలో దాదాపు 3,500 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలను సాగు చేశారు. వచ్చే మూడు నెలల్లో మొదటి దశలో నాటిన మొక్కల గెలలు కోతకు రానున్నాయి. ఇంత వరకు బాగానే ఉన్నా.. పంటను ఎక్కడ అమ్ముకోవాలనే విషయంలో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో ముందు నుంచి ఆయిల్‌పామ్ తోటల సాగుతోపాటు కొనుగోలు బాధ్యతను ప్రీ యూనిక్ ఇండియా లిమిటెడ్ కంపెనీ తీసుకున్నది. ఇందులో భాగంగానే సోన్ మండలంలోని పాక్‌పట్ల వద్ద పామాయిల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు ఈ కంపెనీ యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేసింది. 2023లోనే అప్పటి బీఆర్ఎస్ మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డిలు ఫ్యాక్టరీ పనులకు శంకుస్థాపన చేశారు. నిర్మల్ జిల్లాతోపాటు పక్క జిల్లాల్లోని రైతులు సాగు చేసే ఆయిల్‌పామ్ ఉత్పత్తులను తమ కంపెనీ కొనుగోలు చేసి, ఇక్కడి పరిశ్రమలోనే ఆయిల్‌ను ఉత్పత్తి చేయనున్నట్లు అప్పట్లో ప్రీ యూనిక్ కంపెనీ ప్రకటించింది. దీంతో స్థానికంగానే పంట దిగుబడులను విక్రయించుకునే వెసులుబాటు ఉండడంతో జిల్లా రైతులు పెద్ద సంఖ్యలో సాగుకు ముందుకొచ్చారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 8,200 ఎకరాల్లో మొక్కలను పెంచుతున్నారు. అయితే పామాయిల్ పరిశ్రమ నిర్మాణానికి ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంతో మార్కెటింగ్‌పై ఆందోళన మొదలైంది. రైతులకు అండగా నిలవాల్సిన నాయకులు పరిశ్రమ ఏర్పాటుకు అడ్డంకులు సృష్టిస్తుండడంపై వారు మండి పడుతున్నారు. ఈ క్రమంలో కొత్తగా ఆయిల్ పామ్ సాగు చేయాలనుకుంటున్న రైతులు వెనకడుగు వేస్తున్నారు.

మొదలు కాని ఫ్యాక్టరీ పనులు

సోన్ మండలంలోని పాక్‌పట్ల గ్రామం వద్ద 2023 అక్టోబర్ 4న ప్రీ యూనిక్ సంస్థ పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులకు భూమి పూజ చేసింది. ఈ కార్యక్రమానికి అప్పటి మంత్రులు కేటీఆర్, నిరంజన్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు కంపెనీ పనులు మొదలు కాకపోవడంపై రాజకీయ నాయకుల్లో సమన్వయం లేకపోవడమేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇరిగేషన్ అనుమతులు లేవన్న కారణాన్ని సాకుగా చూపుతూ తన అనుమతి లేకుండా ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్ట వద్దని సదరు కంపెనీ యాజమాన్యాన్ని హెచ్చరించినట్లు నియోజకవర్గ స్థాయిలో కీలక పదవిలో ఉన్న ప్రజాప్రతినిధిపై ఆరోపణలు ఉన్నాయి. అయితే ఇక్కడ ఫ్యాక్టరీ నిర్మాణానికి 40 ఎకరాల భూమిని కొనుగోలు చేసిన ప్రీ యూనిక్ కంపెనీ.. ప్రస్తుతం ఎలాంటి అభ్యంతరం లేని 2.25 ఎకరాల భూమికి ఎన్‌వోసీ మంజూరు చేయాలని నీటి పారుదల శాఖకు విన్నవించింది. ఇప్పటికే ఫ్యాక్టరీ నిర్మాణానికి సంబంధించి తమ వద్ద అన్ని అనుమతులు ఉన్నాయని, కేవలం ఇరిగేషన్ శాఖ నుంచి ఒక్క ఎన్‌వోసీ ఇప్పిస్తే పనులు మొదలు పెడతామని కంపెనీ ప్రతినిధులు ఇటీవలే కలెక్టర్‌ను కలిసి స్పష్టం చేసినట్లు సమాచారం. అధికారుల నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో పామాయిల్ పరిశ్రమ ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఫ్యాక్టరీ నిర్మాణ సంస్థ యాజమాన్యంపై ఇక్కడి రాజకీయ నాయకుల నుంచి వస్తున్న ఇబ్బందులను భరించలేక పరిశ్రమను నిజామాబాద్ జిల్లాకు తరలించేందుకు యత్నిస్తున్నట్లు చెబుతున్నారు. నిజామాబాద్ జిల్లాలోని నందిపేట్ ప్రాంత రైతులు పరిశ్రమ ఏర్పాటు చేస్తే స్వచ్ఛందంగా భూములిస్తామని కంపెనీ యాజమాన్యానికి హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ విషయంలో ప్రీ యూనిక్ కంపెనీ కొంత సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తున్నది. ఇదే జరిగితే నిర్మల్ జిల్లా నుంచి విలువైన, వందలాది మందికి ఉపాధి కల్పించే పామాయిల్ పరిశ్రమ తరలిపోయే ప్రమాదం ఉంది. రాజకీయాలు మాని రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పామాయిల్ పరిశ్రమ జిల్లా నుంచి తరలిపోకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

కేసీఆర్ ప్రభుత్వం కృషి

రైతులను లాభాల బాట పట్టించడమే కాకుండా, ప్రత్యామ్నాయ సాగు వైపు దృష్టి సారించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించింది. ఆయిల్‌పామ్ సాగుకు ముందుకొచ్చిన రైతులకు సబ్సిడీతో పాటు డ్రిప్ ఇరిగేషన్ సదుపాయాన్ని కల్పించింది. నాలుగేళ్లపాటు పంట నిర్వహణ, ఎరువుల కోసం ఎకరానికి రూ.4200 చొప్పున అందించింది. సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి వద్ద పెద్ద ఎత్తున నర్సరీని ఏర్పాటు చేసి ఆయిల్‌పామ్ మొక్కలను పెంచారు. రూ.200 విలువ గల మొక్కకు 180ల సబ్సిడీ ఇచ్చి కేవలం రూ.20లకే ఒక మొక్కను రైతులకు అందించింది. దీంతో నిర్మల్ జిల్లాలో పెద్ద సంఖ్యలో రైతులు ఆయిల్‌పామ్ తోటలను పెంచేందుకు ముందుకొచ్చారు. పరిశ్రమ నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఇవ్వడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో పరిశ్రమ పనులు నేటికీ ప్రారంభం కాలేదు.

కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం

తలమడుగు, ఏప్రిల్ 2 : పదేళ్లలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని అనేక రంగాల్లో అభివృద్ధి చేశారని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం భరంపూర్ గ్రామంలో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి జరిగిందన్నారు. గ్రామంలో పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో వాజిద్, తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎంపీడీవో శేఖర్, పీఏసీఎస్ చైర్మన్ వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేశ్, నాయకులు ముడుపు కేదారేశ్వర్ రెడ్డి, రంజిత్‌రెడ్డి, రమాకాంత్, సుదర్శన్, మడూరి మల్లేశ్, కాట్‌పెల్లి శ్రీనివాస్‌రెడ్డి, పల్లవి, సునీత, రాంబాయి పాల్గొన్నారు.

భరంపూర్‌లో సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ముగిసిన పది పరీక్షలు

ఎదులాపురం, ఏప్రిల్ 2 : మార్చి 21న ప్రారంభమైన పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 10,050 మంది విద్యార్థులకు 52 కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం చివరి పరీక్ష సాంఘిక శాస్త్రం ఆటంకాలు లేకుండా ముగిసింది. చివరి రోజు పరీక్షకు 10,023 మంది హాజరు కాగా 27 మంది గైర్హాజరైనట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు. కేంద్రాలను కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్‌లు సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈనెల 7వ తేదీ నుంచి మూల్యాంకనం ప్రారంభం కానుంది.

నిర్మల్‌లో కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 2 : మామడ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. అలాగే తానూర్ మండలంలోని పరీక్ష కేంద్రాలను డీఈవో రామారావు పరిశీలించారు. చివరి రోజు పరీకు 12 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. జిల్లా వ్యాప్తంగా 9129 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 9117 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు తెలిపారు.

ఎదులాపురం : పరీక్ష కేంద్రం బయట విద్యార్థులు

సీసీఐ ప్రారంభానికి చర్యలు తీసుకోండి

కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామికి వినతిపత్రం

- మంత్రిని కలిసిన బీఆర్ఎస్ ఎంపీలు, మాజీ మంత్రి జోగు రామన్న
- సానుకూలంగా స్పందించిన కుమారస్వామి

ఆదిలాబాద్, ఏప్రిల్ 2(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమ పునఃప్రారంభానికి సంబంధించి జరుగుతున్న ఆందోళన కార్యక్రమంలో భాగంగా బుధవారం రాజ్యసభ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సురేశ్‌రెడ్డి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ సభ్యులు దామోదరరావు, మాజీ మంత్రులు జోగు రామన్న, శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు సీసీఐ సాధన కమిటీ సభ్యులు ఢిల్లీలో కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిశారు. మూతబడిన సీసీఐని ప్రారంభించాలని వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సీసీఐని ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినట్లు తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి జోగు రామన్న కేంద్ర మంత్రులను కలిసి పరిశ్రమకు ప్రారంభానికి అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామని సూచించినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సీసీఐని ప్రారంభిస్తామని హామీ ఇచ్చారన్నారు. మాజీ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం కూడా పరిశ్రమను సందర్శించి ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు గుర్తు చేశారు. పరిశ్రమ ప్రారంభానికి ఎన్నో రోజులుగా ఉద్యమాలు జరుగుతున్నాయని, వేలాది మందికి ఉపాధి కల్పించే సీసీఐని తెరిపిస్తే జిల్లా అభివృద్ధితోపాటు దేశంలో సిమెంటు రంగానికి డిమాండ్ ఉన్నందున పరిశ్రమ అభివృద్ధి చెందే అవకాశాలున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ నాయకుల అభ్యర్థన మేరకు సానుకూలంగా స్పందించిన మంత్రి కుమారస్వామి తనకు కొంత సమయం ఇవ్వాలని, పరిశ్రమ ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేశ్, కో-కన్వీనర్ విజ్జిగిరి నారాయణ, అరుణ్‌కుమార్, నగేశ్, పోశెట్టి, రమేశ్, జగన్, దేవేందర్, నారాయణ, ఆశన్న, మనోజ్ ఉన్నారు.

కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ ఎంపీలు, మాజీ మంత్రులు జోగు రామన్న, శ్రీనివాస్‌గౌడ్, సాధన కమిటీ సభ్యులు

వీవోఏల కలెక్టర్ ముట్టడి

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 2 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బుధవారం నిర్మల్ కలెక్టర్ కార్యాలయాన్ని వీవోఏలు ముట్టడించారు. వీవోఏలు కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో గేటు ముందు కూర్చొని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు రావాల్సిన స్త్రీనిధి వడ్డీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్త్రీనిధి ఇన్సెంటివ్ డబ్బులు వీవోఏలకు, వీవోలకు వెంటనే విడుదల చేయాలని కోరారు. స్త్రీనిధి బ్యాంకు నుంచి ప్రత్యేకంగా వీవోఏలకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలన్నారు. స్త్రీనిధి నుంచి ప్రతి వీవోఏకు ట్యాబ్, ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రమోషన్స్ కల్పించాలన్నారు. సంఘ సభ్యులకు వాటా ధనం వెంటనే చెల్లించాలన్నారు. పెండింగ్ క్లెయిమ్‌లను క్లియర్ చేయాలని కోరారు. ఆందోళన అనంతరం ఇన్‌ఛార్జి డీఆర్డీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు స్వప్న, సంగీత, శరత్, పవన్, చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వీవోఏలు

వేధింపులపై ఫిర్యాదు చేయాలి

ఎస్పీ ఆఖిల్ మహాజన్

ఎదులాపురం, ఏప్రిల్ 2 : ఆడపిల్లలు, మహిళలు, ఉద్యోగ స్థలాల వద్ద మహిళలు వేధింపులకు గురైతే నిరభ్యంతరంగా ఫిర్యాదు చేయాలి, వారికి షీ టీం బృందాలు అండగా ఉంటాయని ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. షీ టీం బృందాన్ని సంప్రదించడానికి 87126 599 53 మొబైల్ నంబర్‌ను అందుబాటులో ఉంచామని తెలిపారు. పాఠశాల, కళాశాలల్లో రోజు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థినులకు గుడ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు జరుగు పద్ధతులు, మహిళా చట్టాలు, నూతన చట్టాలపై అవగాహన నిర్వహిస్తూ చైతన్య పరుస్తున్నామని తెలిపారు. గత నెలలో జిల్లా వ్యాప్తంగా 34 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, మూడు పెట్టి కేసులు, ఒక ఎఫ్ ఐఆర్ కేసు నమోదు చేశామని తెలిపారు.